క్లుప్తంగా

కార్యదర్శిగా మణికంఠ

నవాబుపేట: ఎన్‌ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శిగా నవాబుపేట మండల కేంద్రానికి చెందిన మణికంఠను నియమించినట్లు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం నియామక ప్రతం అందించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాన భూమిక పోషించే ఎన్‌ఎస్‌యూఐ మరింత పట్టుదలతో పనిచేసి ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. మణికంఠకు జిల్లా బాధ్యతలు అప్పగించటం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు రాంచంద్రయ్య, అజహర్, రాజేష్, శ్రీహరి, రమేష్, మల్లేష్, నర్సింహ, సత్యం, కుమార్, ఆంజనేయులు తదితరులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

భూత్పూర్: మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన సురేష్ గౌడ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం బాధితకుటుంబాన్ని పరామర్శించారు. సురేష్ గౌడ్ కుటుంబానికి ఆదుకుంటామని ఆయన చెప్పారు. మాజీ ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ గౌడ్, మాజీ సర్పంచులు వెంకటయ్య, ఫసియోద్దీన్, సీనియర్ నాయకులు నారాయణ గౌడ్, మురళీధర్ గౌడ్, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎం. సత్యనారాయణ, గోప్లాపూర్ సత్యనారాయణ, బోల వెంకట్రాములు తదితరులు ఉన్నారు.

బీజేపీలో చేరిక

గండేడ్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. పగిడ్యాల్, చిన్న వార్వాల్, ఆశిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో మండలాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో చేరికల కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల అందజేత



మద్దూరు: ఉమ్మడి మండలంలోని లింగల్‌చేడ్‌లో చెరువులో పూడికతీత పనులు చేస్తున్న కూలీలకు ఎంపీడీఓ జయరాములు బుధవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఎండ తీవ్రంగా ఉన్నందున ఓఆర్ఎస్ ద్రావణాన్ని తరుచు తీసుకోవాలని కూలీలకు సూచించారు. అలాగే కొలతల ప్రకారం పనులు చేస్తే అధిక కూలీ పొందొచ్చని సూచించారు. అలాగే కొత్తపల్లి తండాలలో నర్సరీని ఏపీఓ సిద్ధేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. వర్షకాలం నాటికి మొక్కలను ఏపుగా పెంచాలని సూచించారు. కొత్తపల్లి మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటర్లకు కనీస అవసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా భాస్కర స్వామి

కోస్గి: గుండుమాల్ మండల తహసీల్దార్‌గా భాస్కర స్వామి బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ పాండు నాయక్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖకు పట్టుబడటంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనందం ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏలో విధులు నిర్వహిస్తున్న భాస్కరస్వామి బదిలీపై గుండుమాల్ మండల తహసీల్దార్‌గా వచ్చారు. ఈ మేరకు కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ నుంచి బాధ్యతలు తీసుకోగా కార్యాలయ అధికారులు, సిబ్బంది తహసీల్దార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకట్రాములు, సీనియర్ అసిస్టెంట్ భీమమ్మ, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అందరూ ఇన్‌చార్జ్‌లే..!

- నియోజకవర్గంలో ఎంఈఓలంతా వారే
- నవాబుపేటలో ఇద్దరు మాత్రమే రెగ్యులర్ అధికారులు



నవాబుపేట ఎంపీడీఓ కార్యాలయం

నవాబుపేట: మండలంలో ప్రధాన శాఖల్లో ఇన్‌చార్జ్‌ల పాలన కొనసాగుతోంది. దీంతో ఆయా శాఖల్లో నిర్వహించే అభివృద్ధి పనుల విషయం ప్రశ్నార్థకంగా మారుతోంది. కేవలం ఇద్దరు అధికారులు మినహా మిగతా వారంతా ఇన్‌చార్జ్‌లే ఉండడం గమనార్హం. కాగా వీరిలో తహసీల్దార్ నాన్యనాయక్, వ్యవసాయ అధికారి కృష్ణకిషోర్ మాత్రమే రెగ్యులర్ అధికారులు కావడం విశేషం. కాగా ప్రధాన శాఖల అధికారులు ఇన్‌చార్జ్‌లుగా ఉండడంతో ఎక్కడా అభివృద్ధి పనులు జరగటం లేదు.

పరిస్థితి ఇలా..

గత ఎన్నికలప్పటి నుంచి మండలంలో ఎంపీడీఓ పోస్టు ఖాళీగానే ఉంది. అసలే గ్రామాలకు స్పెషల్ అధికారులు ఉండగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఉండటంతో పరిపాలన ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ట్రాన్స్‌కోలోనూ ఏఈ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో మరో మండలానికి చెందిన ఏఈకి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు.

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు డాక్టర్లు ఉండాల్సిన అవసరం ఉండగా ఒక్కరితోనే నెట్టుకొస్తున్నారు. మహిళ వైద్యురాలు అందుబాటులో లేదు. అలాగే ఇద్దరు పశువైద్యాధికారులకు గానూ ఒక్కరే ఉన్నారు. దీంతో ఇన్‌చార్జ్‌గా ఉన్న వారికి భారంగా మారింది. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా రెగ్యులర్ వారిని నియమించాలని పలువురు కోరుతున్నారు.

ఎంఈఓలందరూ ఇన్‌చార్జ్‌లే..

జడ్చర్ల నియోజకవర్గంలోని నవాబుపేట, బాలానగర్, మిడ్జిల్, రాజాపూర్, జడ్చర్లలకు చెందిన ఎంఈఓలు అందరూ ఇన్‌చార్జ్‌లే ఉండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. విద్యాశాఖ పర్యవేక్షణ ఉండడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడ మండల విద్యాశాఖను ఇన్‌చార్జ్‌లుగా చూస్తున్నవారికి.. ఒక్కొక్కరికి రెండు నుంచి మూడు మండలాలు ఉండడంతో ఏ ఒక్క మండలానికి వారు సరైన న్యాయం చేయలేని పరిస్థితి దాపురిస్తోంది. నవాబుపేట విద్యాశాఖ అధికారి రాజునాయక్ హన్వాడకు సైతం ఎంఈఓగా ఉన్నారు. ఆయన గత మూడు సంవత్సరాలుగా నవాబుపేటకు ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. దీంతో మండలంలో 97 పాఠశాలలు, 4 హాస్టళ్లు తదితరాలను పర్యవేక్షించాలంటే తలకు మించిన భారంగానే మారుతోందని చెప్పవచ్చు. మండలంలో ఉన్న రెండు హాస్టళ్లు ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలోనే సాగుతున్నాయి. విద్యార్థుల మెను తదితరాల విషయంలో ఎవరిని కదిలించినా తాము ఇన్‌చార్జ్‌లమంటూ సమాధానం దాటవేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

చిన్నచింతకుంటలోనే చర్చలు జరపాలి



కరపత్రాలను విడుదల చేసిన నాయకులు

చిన్నచింతకుంట: బీడీ కార్మిక సంఘాల నాయకులకు, ఫ్యాక్టరీ యాజమానులకు మధ్య జరిగే చర్చలు చిన్నచింతకుంటలోనే కొనసాగాలని.. తెలంగాణ బీడీ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. యాదగిరి అన్నారు. బుధవారం చిన్నచింతకుంటలో బీడీ కార్మికుల సమస్యల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడీ కార్మికుల కూలి పెంపునకై ఫ్యాక్టరీ యాజమానులు, బీడీ కార్మిక సంఘాల నాయకులతో జరిగే చర్చలు చిన్నచింతకుంటలోనే కొనసాగించాలన్నారు. చిన్నచింతకుంటలోనే అత్యధికంగా బీడీ కార్మికులు, ఫ్యాక్టరీలు ఉన్నాయన్నారు. కానీ కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం హైదరాబాద్ లేదా మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తూ ఉంటారన్నారు. దీంతో ఈ చర్చలకు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు హాజరు కాలేకపోతున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికైనా నేడు మహబూబ్‌నగర్‌లో నిర్వహించే చర్చలు చిన్నచింతకుంటలోనే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఖలీల్, బుజ్జన్న, వెంకటన్న, మునెప్పతో పాటు పలువురు ఉన్నారు.

అబద్ధాల కాంగ్రెస్‌ను నమ్మొద్దు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

అడ్డాకుల: తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చి.. వాటిని అమలు చేయకుండా అబద్ధాలు చెప్తున్న కాంగ్రెస్ పార్టీని ఎవరు నమ్మొద్దని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలంలోని పోల్కంపల్లి, చక్రాపూర్, జానంపేట, నిజాలాపూర్, వేముల గ్రామాల్లో బుధవారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి తానిచ్చిన హామీలను నెరవేర్చకుండా దేవుళ్లపై ఒట్టేయాలే... కేసీఆర్‌ను తిట్టాలనే రెండు పనులనే చేస్తున్నాడని విమర్శించారు. వరి రైతులకు బోనస్ ఇవ్వకుండా, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. బోగస్ మాటలు చెప్పే కాంగ్రెస్‌ను నమ్మి మరోసారి ఆగం కాకుండా కేసీఆర్‌కు అండగా ఉండాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ, విండో అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, కోఆప్షన్ జమీర్, కొండయ్య, రఘుపతిరెడ్డి, శివరాములు, రాజు, అనిల్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, రఘు తదితరులు ఉన్నారు.

నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



కోటకదిరలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండలంలోని మాచన్‌పల్లి తండా, వెంకటాపూర్, రేగడిగడ్డ తండా, జైనల్లీపూర్, కోటకద్ర, పోతన్‌పల్లి గ్రామాల్లో ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. మనకు కావల్సినంత అభివృద్ధిని వచ్చే ఐదేళ్లలో చేసుకుందామని చెప్పారు. మహిళా సంఘాలకు రూ. కోటి వరకు రుణాలు ఇప్పించే విధంగా ప్రణాళికలు రూపొందించారని.. వారే కొందరికి ఉద్యోగాలు కల్పించే విధంగా మహిళా శక్తిని తయారు చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి ఉన్నారని స్పష్టం చేశారు. గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వల్ల మనకు కలిగిన లాభం ఏమీ లేదని అన్నారు. ఏకకాలంలో రూ. 2 లక్షలు పంద్రాగస్టులోగా మాఫీ చేస్తామని స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోవింద్‌యాదవ్, నాయకులు బెక్కరి మధుసూదన్‌రెడ్డి, భీమయ్య, శేఖర్‌నాయక్, ధర్మాపూర్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

మహమ్మదాబాద్: జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీలో మహమ్మదాబాద్‌కు చెందిన జట్టు యువకులు మంచి ప్రతిభ కనబర్చి విజయం సాధించడంతో వారిని గ్రామస్తులు అభినందించారు. దోమ మండలంలోని పాలెపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన తాలుకా స్థాయి క్రికెట్ టోర్నీలో 32జట్లు పాల్గొనగా వారిలో ఫైనల్‌లో శివారెడ్డిపల్లి మహమ్మదాబాద్ జట్లు తలపడగా వారిలో మహమ్మదాబాద్ జట్టు విజయం సాధించి మొదటి బహుమతిగా రూ. 25వేల నగదు ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈసందర్భంగా కెప్టెన్ సతీష్, వైస్ కెప్టెన్ శివలను అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శాంతీబాయి పాల్గొన్నారు.

సభకు తరలిరండి

గండేడ్: ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం జరిగే ప్రజా ఆశ్వీరాద సభకు తరలి వచ్చి విజయవంతం చేయాలని గండేడ్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పెంట్యానాయక్ పేర్కొన్నారు. దేశాయిపల్లి ఎక్స్ రోడ్డులో సభ జరగనుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు జరిగే ఈ సమావేశానికి మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డితో పాటు లోక్ సభ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌లు హాజరవుతారన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ సమావేశానికి తరలిరావాలని ఆయన కోరారు.





వైభవంగా పల్లకీసేవ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక కోయిలకొండ ఎక్స్‌రోడ్డులోని గట్టుపై వెలసిన శ్రీవిజ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో బుధవారం రాత్రి అమావాస్య పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారి పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. ఆవోతు నాగరాజు, లక్ష్మమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పదేళ్లలో పేదలకు చేసిందేమీలేదు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర/భూత్పూర్/చిన్నచింతకుంట: పదేళ్ల బీజేపీ పాలనలో పేద ప్రజలకు చేసింది ఏమీ లేదని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం దేవరకద్రలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా జరిగిన భారీ ఎన్నికల ప్రచార ర్యాలీ అనంతరం కొత్త బస్టాండ్ చౌరస్తాలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే మాట్లాడారు. మోదీ పాలనలో పేదలు కష్టాల పాలయ్యారని సిలిండర్ ధర, పెట్రోల్ డీజిల్ ధరలను విపరీతంగా పెంచారని ఆరోపించారు. బీజేపీ పాలన అంతా ధనవంతుల కొమ్ముకాస్తు పేదల ఆర్థిక పరిస్థితిని దిగజార్చారని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. జన్‌ధన్ ద్వార నల్లధనాన్ని వెలికి తీసి పేదల ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామని మరో మోసం చేశారని ఆరోపించారు. మోసపూరిత బీజేపీకి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఇక బీఆర్ఎస్‌కు ఓటు వేసి కూడా దండగని ఆ పార్టీ ఎన్నికల తరువాత కనుమరుగు కాక తప్పదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా దేవరకద్ర ప్రజల ఇబ్బందులు దూరం చేయడానికి రైల్వే అండర్‌పాస్ నిర్మాణం చేస్తామని ఇచ్చిన హామీ త్వరలో నేరవేరుస్తామన్నారు. గత నెలలో రైల్వే ఉన్నతాధికారలను కలిశామని తమ అభ్యర్థన మేరకు రెండు రోజుల క్రితం అండర్‌పాస్ నిర్మాణం కోసం సర్వే చేసి.. సుముఖత వెల్లడించారని ఎన్నికల అనంతరం శంకుస్థాపన చేస్తామన్నారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌కుమార్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజల్‌రెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, అంజన్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆదిహన్మంతరెడ్డి, జవహర్, వర్మ, రంగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సమక్షంలో బుధవారం దేవరకద్ర నియోజకవర్గ పరిధిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో వివిధ పార్టీలకు చెందిన వివిధ మండలాల నాయకులు పార్టీలో చేరారు.

ముమ్మరంగా ఇంటింటి ప్రచారం



ఊరంచుతండాలో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలంటూ స్థానిక ఐదో వార్డు పరిధిలోని ఎనుగొండ, ఎస్సీకాలనీ, జయశంకర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇమ్మడి పురుషోత్తం, వీరన్న, గొల్ల రమేష్, ఎం.శివకుమార్, శ్రీధర్, రాజు, రత్నం, అజయ్, వెంకటేశ్, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: మండల పరిధిలోని నంచర్ల, జూలపల్లి, ఎన్మిచెర్వుతాండ, దేశాయిపల్లి గ్రామాలకు కలిపి నంచర్లగేట్ దగ్గర గురువారం కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు మండల అధ్యక్షుడు కేఎం నారాయణ తెలిపారు. చిన్నాయపల్లి, షేక్‌పల్లి, ధర్మాపూర్, సంగాయపల్లి, కంచన్‌పల్లి గ్రామాలకు కలిపి మహమ్మదాబాద్‌లో ప్రచార సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి హాజరుకానున్నట్లు వివరించారు.



ఎనుగొండలో ఇంటింటి ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

నవాబుపేట: కాంగ్రెస్ పార్టీ హయంలోనే గిరిజన తండాల అభివృద్ధి జరిగిందని డీసీసీ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి బంగ్లారవి అన్నారు. బుధవారం ఊరంచుతండా, సీతమ్మ, పుణ్యనాయక్ తండాల్లో జరిగిన ప్రచార కార్యక్రమాల్లో వారు పాల్గొని ప్రసంగించారు. మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, ఎంపీటీసీ తులసీరాంనాయక్, కార్యక్రమ ఇన్‌చార్జ్ గోపాల్‌నాయక్, నీల్యానాయక్, వాసుయాదవ్, రాజశేఖర్, రాజేష్ తదితరులు ఉన్నారు.

గండేడ్: ప్రజలు మరోమారు రంజిత్‌రెడ్డిని గెలిపించాలని పీసీసీ మెంబర్ నరసింహరావు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి, లోక్‌సభలో రంజిత్‌రెడ్డి, ప్రధానిగా రాహుల్‌గాంధీ అధికారంలో ఉండేలా చూడాలన్నారు. పెద్దవార్వాల్, వెన్నాచేడ్, సల్కర్‌పేట్, కొండాపూర్, పగిడ్యాల్, కొంరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యక్షుడు అనంతలక్ష్మారెడ్డి, కార్యవర్గ సభ్యుడు ఆశిరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆశన్న, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు టీక్యానాయక్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



నసరుల్లాబాద్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని.. కాంగ్రెస్ పార్టీతోనే అవి సాధ్యమవుతాయని స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా మండల పరిధిలోని నసరుల్లాబాద్, చర్లపల్లి తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తమ ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఆర్టీసీ బస్సులలో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారని గుర్తు చేశారు. రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, తదితర గ్యారెంటీలు ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయాయన్నారు. రైతు భరోసా నిధులు పంపిణీ చేశామని, ఆగస్టు 15 లోగా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మరింత అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం మరిచి ప్రజలపై అప్పుల కుప్ప పెట్టిపోయిందని, తాము అధికారంలోకి వచ్చాక దశల వారీగా అభివృద్ధి, సంక్షేమానికి పాటు పడుతున్నామని తెలిపారు.ఈసందర్భంగా ఆయా గ్రామాలలో వివిధ పార్టీల నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటయ్య, మినాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్రమోదీ యుగ పురుషుడు



పెద్దవార్వాల్‌లో ఉపాధి కూలీలకు అల్పాహారం అందజేస్తున్న వెన్న ఈశ్వరప్ప

గండేడ్: భారతదేశ చరిత్రలోనే మోదీ పాలన ప్రత్యేకత కలిగిందని ఆయన ఓ యుగపురుషుడని ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప పేర్కొన్నారు. బుధవారం పెద్దవార్వాల్, చిన్నవార్వాల్ తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పెద్దవార్వాల్‌లో ఉపాధిహామీ కూలీల దగ్గర మాట్లాడారు. వారికి అల్పహారం పంపిణీ చేశారు. అనంతరం వారితో మాట్లాడుతూ ఈరోజు ఉపాధి పనులు కొనసాగుతున్నాయంటే అది మోదీ పుణ్యమే అని పేర్కొన్నారు. ప్రజల్లో రోజు రోజుకూ బీజేపై ఆదరణ పెరుగుతుందని అన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం సాధించడం ఖాయం అన్నారు.



హన్వాడ పరిధిలో..

మహమ్మదాబాద్: కేంద్రంలో మళ్లీ బీజేపీయే అధికారంలోకి వస్తుందని చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్ మిట్టా పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం వెంకట్‌రెడ్డిపల్లికి చెందిన మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, రాములు మరింత మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు. మండల ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హన్వాడ: మండల పరిధిలోని తిరుమలగిరితండా, పీర్లిప్పగడ్డతండా, రాంనాయక్‌తండా, దేవుజానాయక్ తండా, చిన్నరాంతండాల్లో బుధవారం బీజేపీ గిరిజన నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపి అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, గిరిజనమోర్చా జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్, కార్యదర్శి సురేందర్‌నాయక్, మండల గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు అశోక్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మహమ్మదాబాద్ పరిధిలో

ప్రమాదబీమా పత్రాల అందజేత



నారాయణపేట రూరల్: భవననిర్మాణంలో పనిచేస్తున్న మేస్త్రీలకు బుధవారం భారతి సిమెంట్ ఆధ్వర్యంలో ప్రమాదబీమా పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ వీ.శ్రీకాంత్ మాట్లాడుతూ.. నాణ్యమైన నిర్మాణాలకు భారతి సిమెంట్ పెట్టింది పేరని, ఇతర సిమెంట్‌లతో పోలిస్తే ఇళ్లనిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయొచ్చన్నారు. స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన సంస్థ ఇంజనీయర్లు సైట్ వద్దకు వచ్చి సాయం చేస్తారని తెలిపారు. యాదాద్రి, ఆలేరు–వరంగల్ జాతీయ రహదారి, బాలనగర్ ఫ్లైఓవర్ నిర్మాణంలో భారతి సిమెంట్ ఉపయోగించారని చెప్పారు. అనంతరం సిమెంట్ సాంకేతిక ప్రమాణాలు తెలియజేసి 50మంది మేస్త్రీలకు ప్రమాద బీమా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టెక్నికల్ ఇంజనీయర్ నితిన్, డీలర్ లక్ష్మణ్, మేస్త్రీలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పూర్తయిన బీటీరోడ్డు



బీటీ రోడ్డు నిర్మాణాన్ని చూసేందుకు వచ్చిన గ్రామస్తులు(ఫైల్)

చిన్నచింతకుంట: ఎన్నో ఎళ్లుగా ఎదురు చూస్తున్న ఉంధ్యాల బీటీ రోడ్డు నిర్మాణం ఎట్టకేలకు పూర్తయింది. కాగా అక్కడక్కడ చిన్నచిన్న పనులు మాత్రమే మిగిలాయి. ఈ నేపథ్యంలో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేయడంతో రెండు సంవత్సరాలుగా కంకర పరిచిన రోడ్డుపై ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రస్తుతం పూర్తికావడంతో సంబురపడుతున్నారు. గుంతలు పడ్డ రోడ్డుతో ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడ్డామని ఇప్పుడు ఇబ్బందులు తప్పనున్నాయని చెబుతున్నారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి చొరవతో పనులు పూర్తయినట్లు పేర్కొంటున్నారు. కాగా ఈ రోడ్డు మార్గాన చిన్నచింతకుంట, ఉంధ్యాల ప్రజలతోపాటు కొత్తకోట, రైచూర్ జాతీయ రహదారికి, కురుమూర్తి స్వామి ఆలయానికి చేరుకునే నర్వ, అమరచింత, మదనపురం, మక్తల్, కొత్తకోట మండలాల వారికి యాతన తీరినట్టింది. అయితే రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపం ఉన్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

సంతోషంగా ఉంది

చిన్నచింతకుంట, ఉంధ్యాల గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉంది. గ్రామానికి బీటీ రోడ్డు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గతంలో బీటీ రోడ్డు నిర్మాణానికి అధికారులు కంకర పరిచి మధ్యలో వదిలేశారు. మళ్లీ పనులు ప్రారంభించి పూర్తి చేయాలని పలుమార్లు అధికారులు, కాంట్రాక్టర్‌ను కోరగా ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదు, పనులు చేపట్టడంలేదంటూ సమాధానం ఇచ్చారు. కాగా ప్రస్తుతం పూర్తి చేయడం సంతోషంగా ఉంది.

– దండు వెంకటేష్, ఉంధ్యాల